


జేసీ శుభం బన్సల్ తదితరుల నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న భరత్‌శర్మ - డాక్టర్ భారతి, సుధాకర్, ఉషాకళావత్, బాలకృష్ణారెడ్డి , డాక్టర్ వెంకటరమణారెడ్డి

సంస్కృతి, సంప్రదాయాలను వారసత్వంగా కొనసాగించాలి

- ఉగాది వేడుకల్లో జేసీ శుభం బన్సల్ పిలుపు
- పదిమందికి పురస్కారాల ప్రదానం



తిరుపతి(కల్చరల్), మార్చి 30(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, వేద విజ్ఞానం, సనాతన సంప్రదాయాన్ని వారసత్వంగా కొనసాగించాలని జేసీ శుభం బన్సల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక, సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఆదివారం తిరుపతిలోని కచ్ఛపి ఆడిటోరియంలో నిర్వహించారు. కూచిపూడి నృత్యం, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేద విశ్వవిద్యాలయం ఆచార్యులు భావనారాయణాచార్యులు పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. శనివారం జరిగిన పోటీల్లో జూనియర్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాకు చెందిన 10 మందికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. వారు.. సాహిత్య రంగంలో డాక్టర్ కృష్ణవేణి, సంగీత రంగంలో ఎం.సుధాకర్, అవధానంలో ఉప్పుదడియం భరత్‌శర్మ, వాయిద్యంలో డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ టి.భారతి, డాక్టర్ ఉషా కళావత్, సామాజిక సేవలో డాక్టర్ పైడి అంకయ్య, రాష్ట్రీయ సేవా సమితి బాలకృష్ణారెడ్డి, పర్యావరణ పరిరక్షణ రంగంలో పాలేటి శివాజీ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, పర్యాటక శాఖ ఆర్డీ డాక్టర్ రమణప్రసాద్, జిల్లా అధికారి జనార్దన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



పంచాంగ పఠనం చేస్తున్న కరణం లక్ష్మీ సత్యనారాయణశర్మ

సర్వ శుభకరం

శ్రీకాళహస్తి, మార్చి30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరం సర్వ శుభకరంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆస్థాన సిద్ధాంతి కరణం లక్ష్మీ సత్యనారాయణశర్మ అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన పంచాంగ పఠనం చేశారు. ద్వాదశ రాశుల వారి గ్రహగోచారాలను వినిపించారు. ఏయే రాశుల వారి ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్యం, అవమానం వంటి అంశాలు ఎలా సాగుతాయన్న విషయాలను వివరించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి సమాజం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారన్నారు. భూముల వ్యాపారాలు పుంజుకుని రియల్‌ఎస్టేట్ వారికి మంచి ఆదాయం వస్తుందన్నారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా కళారత్న, ఉగాది పురస్కారాలు

ఉగాది పురస్కార గ్రహీతలు



తులసీనాథం నాయుడు | పురుషోత్తం నాయుడు | ఆకుల మల్లేశ్వరరావు | శ్రీవాణి ఎల్లా | మునిమల్లికార్జున | పద్మనాభం | వీఆర్ రాసాని | ఉషారాణి | సాధుల మునిరత్నం | కిరణ్ క్రాంత్ చౌదరి | కంపల్లె రవిచంద్రన్ | ఆముదాల మురళి

విజయవాడలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు నుంచి కళారత్న పురస్కారాలను అందుకుంటున్న ద్వారం లక్ష్మి

ముక్కంటీశుడికి ప్రత్యేక అభిషేకాలు



భిక్షాల గాలిగోపురం వద్ద ఉగాది స్వాగత ఆర్చి

శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉగాది సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. స్వామివారి గర్భాలయం ముందు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఈవో బాపిరెడ్డి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయఅధికారులు కృష్ణారెడ్డి, నాగభూషణం యాదవ్, హరియాదవ్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం లోపల, వెలుపల ఏర్పాటు చేసిన పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి.



భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఈవో బాపిరెడ్డి



చందనాలంకారంలో చెంగాళమ్మ

విశ్వావసునామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు స్వర్ణకిరీట చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ఉగాదికి కళకళలాడిన కొండ



శ్రీవారి ఆలయం ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక అలంకరణలు



ఆలయం ముందు పురాణ ఘట్టాల సెట్టింగ్

తిరుమల, మార్చి30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం తిరుమల కొండ కళకళలాడింది. శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్.. తొలిసారిగా కాలిఫోర్నియా, కొలంబియా నుంచి ట్రెసిలియం, డెల్ఫీనియం అనే పుష్పాలను తెప్పించి అలంకరించారు. ఆలయం ముందు గొల్లమండపం పక్కనే ఏర్పాటు చేసిన పల్లకిలో శయనిస్తున్న శ్రీనివాసుడు, ఇరువైపుల గరుత్మంతుడు, హనుమంతుడి రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక, రాధాకృష్ణులు, వేణుగానం చేస్తున్న చిన్నకృష్ణుడు, తోటలో మిత్రులతో కలిసి మామిడిపండ్లను తింటున్న చిన్నకృష్ణుడు.. పుష్పాలతో తయారు చేసిన ఏనుగులు, నవధాన్యాలతో రూపొందించిన శ్రీమహావిష్ణువు ప్రతిమలు ప్రత్యేకంగా నిలిచాయి. ఉద్యానవనం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వంద మంది కళాకారులు, టీటీడీ గార్డెన్ సిబ్బంది వంద మంది రెండురోజుల పాటు శ్రమించారు. తిరుమల మొత్తం పండుగ సందడి కనిపించింది. ఆలయం ముందు పలువురు భక్తులు ఉగాది పచ్చడి పంచిపెట్టారు.

రుయాలో నకిలీ సర్టిఫికెట్ల ముఠా

- రుయాస్పత్రిలో నెల రోజులుగా సదరం సర్టిఫికెట్ల పరిశీలన జోరుగా సాగుతోంది. ఇప్పటికే 20కి పైగా నకిలీ సర్టిఫికెట్లను అధికారులు గుర్తించారు. వీటి జారీ వెనుక కొందరు కింది స్థాయి సిబ్బంది పాత్ర ఉన్నట్లు కూడా తేలింది. లోలోపలే దానిపై విచారణ చేపడుతున్నారు.
- తిరుపతి నగరపాలక సంస్థలో పనిచేసే ఓ శానిటరీ మేస్త్రీ.. ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు గతేడాది నవంబరు 1 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు మూడు నెలలు సెలవు కావాలని మెడికల్ సర్టిఫికెట్ సమర్పించారు. ఆ తర్వాతా ఆరోగ్యం కుదుటపడలేదని సెలవును మరో 54 రోజులు పొడిగించాలంటూ ఫిబ్రవరి 1 నుంచి మార్చి 24 వరకు మళ్లీ మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చారు. తన ఆరోగ్యం కుదుటపడిందంటూ ఈనెల 25న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించారు. వీటన్నింటిని రుయాస్పత్రిలోని ఒకే డాక్టరు మంజూరు చేశారు. దీనిపై నగరపాలక సంస్థ అధికారులకు అనుమానం వచ్చి రుయా అధికారులను విచారించగా.. ఈ మెడికల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసిన సదరు డాక్టరు పదేళ్ల కిందట రుయాస్పత్రిలో పనిచేసి అప్పుడే రిటైర్ అయినట్లు తెలిసింది.
- ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న రేణిగుంటవాసి రెండు నెలలు సెలవు కోసం నెల కిందట మెడికల్ సర్టిఫికెట్ సమర్పించారు. ఆ కంపెనీ ప్రతినిధులు అనుమానంతో పరిశీలించగా అది రుయాస్పత్రిలో ఏడేళ్ల కిందట రిటైరైన జనరల్ సర్జరీ విభాగాధిపతి ఇచ్చినట్లుగా తేలింది. ఆ విషయాన్ని రుయా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యల్లేవు.

రుయాలో ఏం జరుగుతోంది?

రుయాలో ఎంఆర్‌డీ (మెడికల్ రికార్డు డిపార్టుమెంటు)లో కొందరు సిబ్బంది గతంలో ఆస్పత్రిలో పనిచేసి బదిలీ అయిన, రిటైరైన అధికారుల పేర్లతో సంతకాలు చేసి వారి హోదాతో నకిలీ సీలు వేసి ఇలా సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికోసం బయట ఓ గదిని సిద్ధం చేసుకొన్నట్లు విమర్శలున్నాయి. కొందరు మధ్యవర్తుల ద్వారా నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5 వేల నుంచి రూ. 20 వేల వరకు అవసరాన్ని బట్టి వసూలు చేస్తున్నారని తెలిసింది. అయితే, సర్టిఫికెట్లు అవసరమైన వారు మధ్యవర్తుల మాటలు నమ్మి నకిలీ వాటినే నిజమైనవిగా భావించి తీసుకెళుతున్నారు. వీటివల్ల భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులకు, విద్యార్థులకు అనేక అనర్థాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు నకిలీ సర్టిఫికెట్ల ముఠా ఆటకట్టించాల్సి ఉంది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



- **సిద్ధమైన ఈద్గా మైదానాలు**

తిరుపతి(కల్చరల్),మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. రంజాన్ ప్రార్థనలకు జిల్లాలోని ఈద్గా మైదానాలు సిద్ధమయ్యాయి. ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. నెల రోజుల పాటు నిష్ఠతో ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు ఉదయం 9.30 గంటలకు రంజాన్ ప్రార్థనలు నిర్వహించనున్నారు. వేలాదిగా తరలివచ్చే ముస్లింల కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

బియ్యం కార్డుదారులకు ఊరట

- ఏప్రిల్ నెలాఖరు వరకు ఈకేవైసీ గడువు పెంపు

తిరుపతి(నేరవిభాగం) మార్చి 30(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల ఈకేవైసీకి ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు పొడిగించింది. జిల్లాలో మొత్తం రేషన్ కార్డుదారుల్లోని సభ్యులు 16.30 లక్షల మంది. వీరిలో ఈ నెల 29 వరకు దాదాపు 14.74 లక్షల మంది మాత్రమే ఈకేవైసీ చేసుకున్నారు. ఇంకా 1.56 లక్షల మంది ఈకేవైసీ చేసుకోవాలి. ఇందులో ఐదేళ్ల పైబడి వున్న పిల్లలు 20,100 మంది ఉన్నారు. వీరంతా ఏప్రిల్ నెలాఖరు లోగా ఈకేవైసీ చేసుకోవాలి. లేదంటే రేషన్ కట్ చేస్తారు. ఎండీయూ ఆపరేటర్ల వద్ద కూడా కార్డుదారులు ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటు ఉంది. రేషన్ దుకాణాలు, ఎండీయూ ఆపరేటర్లు, వార్డు సచివాలయాల వద్ద ఉన్న జాబితా ఆధారంగానే ఈకేవైసీ చేయించుకోవాలి. గతంలో చేసుకున్న వారికి, ఐదేళ్ల లోపు చిన్న పిల్లలు చేయించుకోవాల్సిన పనిలేదు. గతంలో చేసుకున్నామో లేదో అని రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నవాళ్లందరూ వెళ్లి బారులు తీరడంతో సమయం వృథా అవుతోంది. అందుకని ఆయా జాబితాల్లో పేర్లు చూసుకుని.. ఈకేవైసీ చేసుకోవాల్సిన వాళ్లే వెళ్లాలి. 'ఈకేవైసీ లేని సభ్యులు ప్రభుత్వం ఇచ్చిన నెల రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వచ్చే నెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోవాలి' అని డీఎస్‌వో శేషాచలం రాజు తెలిపారు.

చంద్రగిరి

అశ్వ వాహనంపై ఎల్లమ్మ అభయం



చంద్రగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఉగాది పండుగ రోజున ఉదయం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి అశ్వ వాహనంపై అధిష్ఠింపజేశారు. చంద్రగిరి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖరరెడ్డి, ఈవో మమత, శాశ్వత ఉభయదారుడు పాకాల వంశస్తులు ఆలయ మాజీ చైర్మన్లు పాకాల చంద్రశేఖరరెడ్డి, సతీష్‌రెడ్డి, ఉభయదారులు సుబ్బరామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చేతన్‌కుమార్‌రెడ్డి, మహీందర్‌రెడ్డి, చిన్ని, శరత్‌కుమార్, పాకాల చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్‌కు ఘననివాళి



పాకాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం పాస్టర్ పగడాల ప్రవీణ్‌కు నివాళి అర్పించారు. చర్చి ఆవరణలో ఆయన చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మానవహారం ఏర్పాటు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. ఆయన మృతిపై ప్రభుత్వం దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రేమ్‌కుమార్, కార్యదర్శి విక్టర్ ఎం.రాఘవేలు, కోశాధికారి అరుళ్ సెల్వి, స్త్రీల మైత్రి సంఘం కార్యదర్శి విమలా విక్టోరియా, సంఘస్తులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగి ఆత్మహత్య



మృతి చెందిన నరసింహులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది టీటీడీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి సత్యనారాయణపురంలో చోటు చేసుకుంది. అలిపిరి హెడ్ కానిస్టేబుల్ శేఖర్‌బాబు కథనం మేరకు... తిరుమల వకుళమాత అతిథి గృహంలో నరసింహులు(50) కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తున్నాడు. భార్య ధనలక్ష్మి ఇంటి వద్దే బియ్యం షాపు నడుపుతోంది. పెద్ద కుమారుడు స్విమ్స్‌లో ఫిజియోథెరపీ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సు చేస్తున్నాడు. రెండవ కుమారుడు వినయ్ యూబీఐ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన నరసింహులుకు లివర్ దెబ్బతింది. దీనికితోడు 10 రోజులుగా విధులకు వెళ్లకుండా ఇంట్లో కూర్చుని మద్యం తాగుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో కడుపునొప్పితో అల్లాడిపోయాడు. కుటుంబ సభ్యులు చీవాట్లు పెట్టడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి ఇంట్లోని బాత్‌రూములో పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు నితిన్ ఫిర్యాదు మేరకు అలిపిరి హెడ్ కానిస్టేబుల్ శేఖర్ బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన గోవర్ధన రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన తిరుపతి రూరల్ పరిధిలోని సాయినగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. కుర్రకాలువకు చెందిన ఓబుల్ రెడ్డి మనవడు గోవర్ధన రెడ్డి(20) సాయినగర్‌లో నివాసముంటున్నాడు. స్నేహితుడు హేమంత్‌రెడ్డితో కలిసి చెడు తిరుగుళ్లు తిరుగుతూ తాగుడు, ధూమపానానికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం డబ్బు కోసం హేమంత్‌రెడ్డి ఇంటికి వెళుతున్నట్లు నానమ్మ, తాతయ్యకు చెప్పి గోవర్ధనరెడ్డి వెళ్లాడు. అదేరోజు రాత్రి హేమంత్‌రెడ్డి ఇంట్లో కరెంటు షాక్ కారణంగా గోవర్ధనరెడ్డి మృతిచెందినట్లు ఓబుల్‌రెడ్డికి ఫోన్ వచ్చింది. అయితే మృతదేహాన్ని పరిశీలించగా కుడికాలు బొటన వేలికి గాయమై ఉంది. హేమంత్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానం చెబుతుండడంతో వారికి అనుమానం వచ్చింది. విచారణ జరిపి న్యాయం చేయాలని రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గోవర్ధనరెడ్డి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కాగా, గోవర్ధన రెడ్డికి హేమంత్ రెడ్డి గతంలో అప్పు ఇచ్చాడని, ఈ విషయంలో తగాదాలు ఉండేవని ఓబుల్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

కనీస అవసరాలు తీర్చండి



మునికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తిరుపతి(జీవకోన), మార్చి 30(ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో తాగునీరు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, సిమెంటు రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని నగర పరిధిలోని (రెండవ డివిజన్) బొజ్జా తారకం కాలనీ వాసులు డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణకు విజ్ఞప్తి చేశారు. కాలనీ వాసుల అభ్యర్థన మేరకు ఆయన ఆదివారం బొజ్జా తారకం కాలనీలో పర్యటించారు. 20ఏళ్లుగా కాలనీలో కాపురాలు ఉంటున్నామని, కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. డిప్యూటీ మేయర్‌గా మీరైనా చొరవ తీసుకోవాలని కోరారు. సమస్యలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ నేత అంజయ్య, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ సర్పంచ్ ఆదం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



తొమ్మిది అడుగుల జెర్రిపోతు

తిరుమలలో ఆదివారం సుమారు తొమ్మిది అడుగుల జెర్రిపోతు పట్టుబడింది. పాచికాల్వ గంగమ్మ ఆలయానికి సమీపంలో ఉన్న డ్రైనేజ్ సెంటర్‌లోకి వచ్చిన ఈ పామును చూసి సిబ్బంది హడలిపోయారు. అనంతరం టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడు వచ్చి పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శాస్త్రోక్తంగా కోటి లింగేశ్వరుడికి తిరుమంజనం



ప్రత్యేక అలంకారంలో కోటిలింగేశ్వరస్వామి

రామచంద్రాపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటి లింగేశ్వరస్వామికి ఆదివారం శాస్త్రోక్తంగా తిరుమంజనం జరిగింది. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలం కరణ చేపట్టారు. ఉదయం 9గంటలకు వేదమంత్రోచ్చరణల మధ్య రుద్ర హోమం నిర్వ హించారు. ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పండితులు ముకేష్‌శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం వినిపించారు. ఉగాది పచ్చడిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కంట్యాక్స్ విశ్రాంత కమిషనర్ ఏసీ నాయుడు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ సుదర్శన ప్రసాద్

పాకాల, మార్చి 30: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను సీఐ సుదర్శన్ ప్రసాద్, అగ్నిమాపక కేంద్రం అధికారి బి.గుణశేఖర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు పండుగల విశిష్టత, భగవద్గీత సారాంశం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరమణ నాయుడు, హెడ్ కానిస్టేబుల్ చలపతి, దశరథన్, అర్జున, అగ్నిమాపక సిబ్బంది మనోహర్ రెడ్డి, నాగార్జున, సురేంద్ర, త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షుడు బాలాజీ, పాకాల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: **రూ.3.80 కోట్లు**

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: **76,005**

తలనీలాలు సమర్పించినవారు: **22,686**

పీటీసీ సీఐ సదాశివయ్య ప్రొద్దుటూరుకు బదిలీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి పోలీసు శిక్షణా కళాశాలలో పనిచేస్తున్న సీఐ సదాశివయ్యను కడప జిల్లా ప్రొద్దుటూరు టూ టౌన్‌కు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇక్కడ మూడేళ్లు పనిచేశారు. కర్నూలు, అనంతపురం జిల్లాల పరిధిలో పనిచేస్తున్న దాదాపు 16 మంది సీఐలు బదిలీ అయ్యారు.

వేడుకగా శివపార్వతుల ఊరేగింపు



శ్రీకాళహస్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వరస్వామి ఊరేగింపు ఉత్సవం వేడుకగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్క రించుకుని ఆదివారం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూ ర్తులను అలంకార మండ పంలో విశేషంగా అలంకరిం చారు. అనంతరం ఆలయంలోని స్వామివారి సన్నిధి వద్ద ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. పంచాంగ పఠనం అనంతరం స్వామిఅమ్మవార్లకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులు పురవీధుల్లో ఊరేగింపుగా సాగారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో ఉగాది ఆస్థానం



నారాయణవనం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలవాసులు విశ్వావసు తెలుగు సంవత్సరాది ఉగాదిని ఘనంగా నిర్వహించు కున్నారు. ఆదివారం ఉదయం పద్మావతి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో స్వామిఅమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని నూతన పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పెద్ద శేష వాహనంపై కొలువు దీర్చి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉగాది ఆస్థానం నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

శుక బ్రహ్మాశ్రమంలో పంచాంగ శ్రవణం

శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూనందగిరి ఆధ్వర్యంలో ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు ఉంటాయని వెల్లడించారు. వర్షపాతం సాధారణంగా ఉంటుందని, ధరల భారం, ప్రకృతి వైపరీత్యాలు ఉంటాయన్నారు. సెప్టెంబరు 7న చంద్రగ్రహణం ఉంటుందని తెలిపారు.

ఊరూ వాడా ఉగాది సంబరం



కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆస్థానం కోసం పూజ సామగ్రిని తీసుకెళుతున్న అర్చకులు, అధికారులు

చంద్రగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో అన్ని గ్రామాలలో, ఆలయాల్లో తెలుగు నూతన సంవత్సరాది అయిన ఉగాది పండగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఉగాది ఆస్థానం జరిపించారు. ఈసందర్భంగా సోపాన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీహరిలతో సహా సేనాధిపతి అయిన విశ్వక్సేనుడి ఉత్సవర్లను కొలువు దీర్చి ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈకార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూలస్థానమ్మ సన్నిధిలో..

చంద్రగిరిలో వెలసిన మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారిని ఆలయ ఆవరణలో కొలువుదీర్చి పంచాగ శ్రవణం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత పాల్గొన్నారు. అలాగే చంద్రగిరి బజారువీధిలో వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించి, హోమం, అలంకారం, ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం రాజుశర్మచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు దాతలుగా చేగు ఫ్యామిలీ వ్యవహరించింది. తొండవాడ స్వర్ణముఖి నదీ ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో పంచాగ శ్రవణం పఠించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పుష్పపల్లకిపై పద్మావతీ దేవి అభయం

● తిరుచానూరులో కనువిందుగా ఉగాది వేడుకలు





ప్రత్యేక అలంకారంలో పద్మావతి అమ్మవారు, పుష్పపల్లకీలో ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారు కొలువైన తిరుచానూరులో ఆదివారం ఉగాది వేడుకలు అంగరంగం వైభవంగా టీటీడీ నిర్వహించింది. ఉదయం సుప్ర భాత సేవతో అమ్మవారిని అర్చకులు మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవర్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చరణల మధ్య కన్నులపండువగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం పుష్పపల్లకీపై మహాలక్ష్మీదేవి అలంకరణలో పద్మావతిదేవి కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. రాత్రి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఉగాది వేడుకలు





నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు రాఘవస్వామి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. సాయంత్రం శంకరా నాట్య విద్యాలయానికి చెందిన బృందం భరతనాట్య నృత్య ప్రదర్శన, 9గంటలకు కోటి డ్యాన్స్ అకాడమీ బృందం జానపద, శాస్త్రీయ, వెస్ట్రన్ గీతాలకు నృత్య ప్రదర్శనలు చేశారు. పైగా ఆదివారం కావడంతో శిల్పారామం సందర్శకులతో నిండిపోయింది. ఏవో సుధాకార్ కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు







రవిచంద్ర, జస్టిస్ నటరాజన్, భారతి ప్రధి

తిరుమల, మార్చి30 (ఆంధ్ర జ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నటరాజన్, ఎంపీలు వీ రవిచంద్ర, భారతి ప్రధి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

వీటిని అలాగే వదిలేస్తారా..!

చెర్లోపల్లెలో ప్రమాదకరంగా యూడీఎస్ మ్యాన్‌హోల్స్





పాడైపోయిన మ్యాన్‌హోల్స్

తిరుపతిరూరల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాతచెర్లోపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన యూడీఎస్ మ్యాన్‌హోల్స్ కుంగిపోయి ఉన్నాయి. గ్రామం మీదుగా వకుళామాత ఆలయానికి వెళ్లే మార్గంలో పలుచోట్ల మరమ్మతులకు గురై లోపలికి కుంగి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఆదమరిస్తే అదుపుతప్పి కిందపడి పోయే ప్రమాదం ఉంది. కొత్తగా ఈరోడ్డుమీద ప్రయాణించే వాహనచోదకులకు కుంగిన మ్యాన్‌హోల్స్ కనపడడంలేదు. దాంతో వేగంగా వచ్చి ప్రమాదాల బారినపడుతున్నారు. సంబంధిత అధికారులు, పంచాయతీ పాలకులు వీటిని సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేటికీ సామాజిక న్యాయం దొరకడం లేదు



కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అతిథులు

తిరుపతి(కల్చరల్)/(ఆటోనగర్), మార్చి 30(ఆంధ్రజ్యోతి): 75 ఏళ్ల రాజ్యాంగ అనుభవాలను క్రోడీకరించుకుంటే ఇప్పటికీ చాలామంది సామాజిక న్యాయానికి నోచుకోవడంలేదని తిరుపతి జిల్లా ఐదో అడిషనల్ జడ్జి జి.రామగోపాల్ అన్నారు. తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. సామాజిక దృక్పథం ఉన్నవారు పరిమితమవుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో వేమన విజ్ఞాన కేంద్రాల అవసరం ఎంతగానో ఉందని అన్నారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఒక ఇంజనీరుకు పది మంది డిప్లొమా వారు, ఒక డిప్లొమా వ్యక్తికి పది మంది ఐటీఐ నిపుణులు ఉండాలనేది విధానమన్నారు. కాని దేశంలో ఇంజనీర్లు లక్షల్లో మార్కెట్‌లోకి వస్తున్నారని, వారి కింద పనిచేయాల్సిన డిప్లొమా, ఐటీఐ అర్హత వారి కొరత చాలా తీవ్రంగా ఉందని అన్నారు. నైపుణ్యాభివృద్ధి కొరతను నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ తరపున సర్టిఫికెట్లు ప్రదానం చేయడానికి కృషి చేయాలని, తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టెంకాయల దామోదరం, తుడా మాజీ కార్యదర్శి వెంకటనారాయణ, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ టి.విక్రమ్ రెడ్డి, సీనియర్ న్యాయవాది మట్టా పురుషోత్తం రెడ్డి, నాగార్జున, ముఖేష్, మునిలక్ష్మి పాల్గొన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అగరాలలో ఉచిత శిక్షణ

చంద్రగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని అగరాల వద్దవున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్. సుకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తీసుకున్న ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ : 8019729162 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెచ్‌యూఎస్ జిల్లా అధ్యక్షురాలిగా మల్లీశ్వరి

తిరుపతి(గాంధీరోడ్డు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హిందూ ఉపాధ్యాయ సమితి జిల్లా అధ్యక్షురాలిగా పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్ హిందీ టీచర్ రాయల మల్లీశ్వరి నియమితులైనట్లు జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల పేర్కొన్నారు. సంఘాన్ని మరింతగా బలోపేతం చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

జీవకోనలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లింలు

తిరుపతి(జీవకోన), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జీవకోనలోని మజీద్ ఏ మహమ్మదీయలో ఆదివారం దళిత ముస్లిం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. హజరత్ మహమ్మద్ మోహనీ 1949లో దళిత ముస్లిం ఇఫ్తార్ విందు ప్రారంభించారని, దాన్ని అనుసరిస్తూ జీవకోనలో ఏటా రంజాన్ చివరి వారంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఈద్గా వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవ్ నర్సింగ్ కళాశాల చైర్మన్ ప్రవీణ్, భారతీయ దళిత సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, ఏఎంజేఏసీ జాతీయ అధ్యక్షుడు రఫీ పాల్గొన్నారు.

సంతోషాలను తీసుకొచ్చే 'విశ్వావసు'



'ఓ ఉగాది పురుషుడా, నీ రాక మా ఇంట నిత్య సంతోషాల మామిడి తోరణమై రహింప, నీ రాక జాతికి నీతిమంతుల రాజ్యపాలనమందించు బాటగాక, నీ రాక సాహిత్య నీలాంబరమ్మునా కావ్య భాస్వత్ సషాంకముకాగా, నీ రాక కళలెళ్ల నిశ్చలానందము ప్రదమ్ములై దీపించి తన రుచుండ, జాతిమతముల భేదభావమ్ములు శాశ్వతంగా అంతరింపగా, జనుల సౌహార్థపు భావపూర్ణులై భారతాంబకు మొదమిడగా రమ్ము విశ్వావసు.. స్వాగతమగువుమా.., రమ్ము విశ్వావసు.. స్వాగతమగువుమా..,' అంటూ తిరుమల శ్రీవారి ఆలయం ముందు కవి సమ్మేళనం వైభవంగా జరిగింది. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం ఆలయం ముందున్న నాదనీరాజనం వేదికపై సప్తగిరులు సూచికగా ఏడుగురు కవులతో జరిగిన కవి సమ్మేళనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. షడ్రుచుల సమ్మేళనం, సప్తపర్వత సమ్మేళనంగా నిర్వహించిన ఈకార్యక్రమంలో కవులు, అవధానులైన సురభి శంకరశర్మ, అన్నాపంతుల జగన్నాథరావు, మైలవరపు మురళీకృష్ణ, సాయిప్రసాద్, పొన్నెగంటి సూర్యనారాయణ, సురభి బాలరాఘవ సుహర్షిణి, చింతా రామకృష్ణ రావు తెలుగు భాష వైభవం, మన సంస్కృతి, సంప్రదాయాలు, టీటీడీ భక్తులకు చేస్తున్న సేవలపై పద్యాల రూపంలో వివరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి






రామకృష్ణ మిషన్ ఆవరణలో బృందావనం - బ్రహ్మకమలం మొక్కలు - రెడ్‌జింజర్ - ఔషధగుణాలున్న బిర్యానీ ఆకు

రామకృష్ణ మిషన్‌లో 'బృందావనం'



రోగ నిరోధక శక్తిని పెంచే బిట్టర్‌లీఫ్ మొక్క




మింట్ తులసి - కదంబం




విరిగిన ఎముకలు త్వరగా అతుక్కోవడానికి దోహదం చేసే మొక్క



వాము ఆకు

తిరుపతి రామకృష్ణ మిషన్ ఆవరణ ఒక ఔషధ వనంలా మారిపోయింది. 40 సెంట్ల స్థలంలో 250 రకాల మొక్కలు ఇక్కడ పెంచుతున్నారు. రంగురంగుల పూలతో, రకరకాల పండ్లతో, ఆరోగ్యప్రదాయినిలైన మొక్కలతో రామకృష్ణ మిషన్ ఆవరణ కళకళలాడుతోంది. ఇస్కాన్ ఆలయానికి ఎదురుగా ఉన్న రామకృష్ణమిషన్ ఆవరణలోకి అడుగుపెట్టగానే ప్రత్యేకమైన అనుభూతి కలుగుతుంది. నాగమల్లి వంటి భారీ వృక్షాల మొదలు స్నేక్ ప్లాంట్ దాకా విభిన్నమైన వృక్ష, మొక్క జాతులు ఇక్కడ కనిపిస్తున్నాయి. పూర్తిగా సేంద్రియ విధానంతోనే ఈ తోటను పెంచుతున్నారు. వర్మీ కంపోస్టును వీరే తయారు చేసుకుంటారు. మొక్కలకు పురుగులు ఆశించినా రసాయనాలు చల్లరు. నాటు ఆవు పంచితం వినియోగిస్తారు. మిద్దె తోటలు, పెరటి తోటలు పెంచుకోవాలనే ఆసక్తి ఉన్నవారు సందర్శించదగ్గ ప్రదేశం ఇది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



"భగవంతుడు ప్రసాదించిన ఈ వాతావరణాన్ని కాపాడుకోవడమే అదిపెద్ద సంపద. ఇది భావితరాలకు చాలా అవసరం. ప్రకృతిని ప్రేమిస్తే అది మనల్ని రక్షిస్తుంది. ఈ సందేశాన్ని పంచడం కోసమే రామకృష్ణ మిషన్ ఆవరణలో తోట పెంచుతున్నాం. ఇక్కడ కాసే ప్రతి పువ్వూ, కాయా, పండూ దేవుడికే నైవేద్యంగా సమర్పిస్తాం."

- శ్రీకాంత్ మహరాజ్, రామకృష్ణ మిషన్ ప్రతినిధి




పిల్లల్లో చురుకుదనాన్ని పెంచే బ్రహ్మీ మొక్క - కిడ్నీలో రాళ్లను కరిగించే రణపాల





కలువ - లెమన్‌గ్రాస్ - మహాబిల్వం



షుగర్ లెవల్స్ తగ్గించే ఇన్సులిన్‌ప్లాంటు

శాకాంబరి దేవిగా తాతయ్యగుంట గంగమ్మ



తిరుపతి(కల్చరల్), మార్చి 30(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉగాది పర్వదినాన్ని విశేషంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి దేవిగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ముస్లింలకు ఎస్పీ శుభాకాంక్షలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30(ఆంధ్రజ్యోతి) రంజాన్ పండుగ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన రాజు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ నెల శాంతి, సహనం, సోదరతత్వాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

శెట్టిపల్లెకు దారేది?



సూచిక బోర్డులేని శెట్టిపల్లి గ్రామం

తిరుపతి అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన శెట్టిపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కావడమేశాపంగా మారింది. సమస్యలు పెరుగుతున్నాయే తప్పా ఒక్కటంటే ఒక్కటి కూడా పరిష్కారం కావడం లేదు. ఆ ఊరును తెలియపరుస్తూ ఒక్క సూచిక బోర్డు లేదు. కొత్తవారు వెళ్లాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. శెట్టిపల్లి గేటు దాటగానే మూడు మార్గాలు కనిపిస్తాయి. ఎటువెళ్లాలో తెలియక తికమకపడుతున్నారు. నగర పరిధి అయినా సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నగరపాలక సంస్థ వెంటనే స్పందించి అవసరమైన ప్రదేశాల్లో సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

రుయాలో చికిత్స పొందుతూ ఒంగోలు వాసి మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ ఒంగోలు వాసి మృతి చెందాడు. అలిపిరి ఎస్ఐ అజిత వివరాల మేరకు.. ఒంగోలుకు చెందిన వీరాంజనేయులు (63) కొన్నేళ్లుగా భార్యాబిడ్డలను వదిలి దేశ దిమ్మరిలా తిరుగుతున్నాడు. రెండేళ్ల క్రితం తిరుపతికి వచ్చాడు. రుయా, స్విమ్స్ వద్ద తచ్చాడుతూ ఎవరైనా అన్నం పెడితే తింటూ కాలం వెళ్లదీస్తున్నాడు. భూదేవి కాంప్లెక్సు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పడుకుంటూ ఉండేవాడు. ఈ నెల 24న భూదేవి కాంప్లెక్సులో వాష్ రూముకు వెళ్లి కాలుజారి పడ్డాడు. స్థానికులు రుయాలో చేర్పించారు. చికిత్స పొందుతూ 27వ తేదీన అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని అతని భార్యకు ఫోన్ ద్వారా తెలియజేయగా తమకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పడంతో ఇక్కడే ఖననం చేయనున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై సర్వాంతర్యామి



సర్వభూపాల వాహనంపై శ్రీరామచంద్రమూర్తి



కల్పవృక్ష వాహనంపై కోదండరాముడు

తిరుపతి(టీటీడీ), మార్చి 30(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనంపై నాలుగు మాడవీధుల్లో విహరించి అభయమిచ్చారు. 10.30 గంటలకు సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, భక్తులు పాల్గొన్నారు.

స్థానికాలయాల్లో ఉగాది వేడుకలు




కోదండరామాలయంలో వస్త్ర సమర్పణ చేస్తున్న జీయర్ స్వాములు - కోదండరామాలయంలో ఉగాది ఆస్థానం

తిరుపతి (టీటీడీ), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని టీటీడీ స్థానికాలయాల్లో ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. గోవిందరాజ స్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, కొలువు, అర్చన నిర్వహించారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు పంచాంగ శ్రవణం, ఉగాది ఆస్థానం చేపట్టారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి పాల్గొన్నారు. కోదండరామాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం జరిగింది. జీయర్ స్వాములు మూలవర్లకు, ఉత్సవర్లకు వస్త్ర సమర్పణ చేశారు. అలిపిరి సమీపంలోని శ్రీవారి పాదాల మండపం, కపిలతీర్థం ఆలయంలో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం చేపట్టారు.

ఘనంగా ఉగాది ఉత్సవం



అష్టావధానం నిర్వహిస్తున్న మేడసాని మోహన్

తిరుపతి(కల్చరల్), మార్చి 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం మహతి కళాక్షేత్రంలో ఉగాది ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా బెల్లంకొండ ఫణికుమార్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఆయన మాట్లాడుతూ పూర్వం రాజులు ప్రతిరోజూ పంచాంగ శ్రవణం చేసేవారని, ఇది ఎంతో పుణ్యఫలమని అన్నారు. స్వామివారిని భక్తితో సేవిస్తే అన్నీ శుభాలే కలుగుతాయని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. హెచ్‌డీపీపీ ఆధ్వర్యంలో మేడసాని మోహన్ అష్టావధానం ఆకట్టుకుంది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు మంగళధ్వని, ప్రార్థన నిర్వహించారు. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ఆధ్వర్యంలో వేదపండితులు వేదస్వస్తి నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీపీపీ కార్యదర్శి రఘునాథ్, ప్రోగ్రాం అధికారి రాజగోపాలరావు, సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో ఆనందరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ



తిరుపతి అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఆదివారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అధికారులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. రుయాస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని, దాతలు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, మహేష్‌యాదవ్, కిలారి రోశయ్య, తమ్మినేని వెంకటేశ్వర, బాబ్జీ, కేఎంకే లోకేశ్, సుధా, రమణ, హరిశంకర్, ఆర్కాట్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్‌లో ఉత్సాహంగా టెక్నో-2025



టెక్నో-2025 ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న టెక్‌ఆల్ఫా టీమ్

తిరుపతి(విద్య), మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎమరాల్డ్స్ కళాశాలలో టెక్నో-2025 పేరిట టెక్నికల్ ఫెస్ట్ ఉత్సాహంగా జరిగింది. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఎస్సీ, బీసీఏ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సాంకేతిక అంశాలపై పోటీలు నిర్వహించారు. టెక్‌ఆల్ఫా టీమ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. కళాశాల ఉప సంచాలకులు మునిరత్నం, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు నరసింహ, శ్రీనివాసులురెడ్డి, చేతన్‌కుమార్, జీఎం. శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ జాఫర్‌వలి పాల్గొన్నారు.

సంతోషంగా రంజాన్ జరుపుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు ఆకాంక్షించారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

పుత్తూరు వార్తలు

నీటి వృథా అరికట్టరూ...!



మరమ్మతులకు గురైన కొళాయి - రోడ్డుపై పారుతున్న నీరు

పుత్తూరు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొళాయిలు, పైపులైన్లు మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతోంది. పట్టణ ప్రజల అవసరాలకు 6,200 కొళాయిల ద్వారా 42 లక్షల లీటర్ల నీటిని మున్సిపల్ అధికారులు అందిస్తున్నారు. మొత్తం 95 బోర్ల ద్వారా ఈ నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. పైప్‌లైన్ వసతి లేని శివారు ప్రాంతాలైన గణేష్ కాలనీ, వినాయకపురం, హౌసింగ్ కాలనీలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. అయితే పైప్‌లైన్‌లు మరమ్మతులకు గురికావడం, వీధి కొళాయిల నిర్వహణ సరిగా లేకపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పైప్‌లైన్, కొళాయిల మరమ్మతుల నిర్వహణ, నీటి సప్లై తదితర అవసరాలకు మున్సిపాలిటీలో దాదాపు 40 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఇంత మంది ఉన్నప్పటికీ సకాలంలో మరమ్మతులు జరగడం లేదు. ఆదివారం గేట్ పుత్తూరులోని విజయ గణపతి ఆలయం వద్ద కొళాయి మరమ్మతులకు గురై రెండు రోజులుగా నీరు వృథాగా పోతోంది. సదరు ఫిట్టర్ పట్టించుకోకపోవడంతో ఆ వీధి మొత్తం నీటితో నిండిపోయింది. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉగాది పచ్చడి పంపిణీ



పుత్తూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు ఉగాదిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం వాకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆస్పత్రిలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. తర్వాత అంబేడ్కర్ కూడలిలో పాదచారులు, వాహనదారులు, ప్రయాణికులకు పంపిణీ చేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శీనివాసులురెడ్డి, శ్రీధర్‌రాజు, సుభాషిణి, రవిరాజు, మాధవనాయుడు, కెఎల్ఎస్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక సదాశివేశ్వరస్వామి ఆలయం ముందు అపస్ ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

అప్పలాయగుంటలో వైభవంగా ఉగాది ఆస్థానం



వడమాలపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్వావసు తెలుగు సంవత్సరాది సందర్భంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఆదివారం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తిప్పయాచార్యులు పంచాగ శ్రవణం చేస్తూ ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడిని విశేషంగా అలంకరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరజనాలు సమర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయాధికారి శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

సురేంద్రకు ఉగాది పురస్కారం



వడమాలపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రచయత, వక్త, గాయకుడు, వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.సురేంద్ర ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తిరుపతి నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం అందుకున్నారు. జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో ఆదివారం విశ్వావసు ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ పాటవాలు చూపిన వారు పురస్కారాలు అందుకున్నారు.

వేడుకగా ఉగాది పంచాగ శ్రవణం



సదా శివేశ్వర ఆలయంలో పంచాంగ శ్రవణం

పుత్తూరు టౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయం, సాయిబాబా ఆలయంలో విశ్వావసు తెలుగు సంవత్సరాది సందర్భంగా ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ఉగాది సందర్భంగా పంచాగ శ్రవణం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం: సీపీఐ

శ్రీకాళహస్తి,మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ముందుండి పోరాడుతుందని సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి అంబాకం చిన్నిరాజ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం సీపీఐ నియోజకవర్గ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, శ్మశానానికి దారి తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకు పోరాడాలన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మునిచంద్ర, గిరిజన సంఘం నాయకుడు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

శ్రీరామనవమి వసంతోత్సవాలు



వైకుంఠవాసుడి అవతారంలో బాలాంజనేయస్వామి

సూళ్లూరుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వసంతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం తొలిరోజు స్వామి వారు వైకుంఠవాసుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అభిషేకనంతరం స్వామివారిని పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. అదే విధంగా బ్రాహ్మణ వీధిలోని సీతారాములు దేవస్థానంలో వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

లోలెవల్ కాజ్‌వే నిర్మాణానికి మోక్షం లేదా?

అరవై ఏళ్లుగా ప్రజల ఇబ్బందులు



చెక్‌డ్యామ్ వద్ద చప్టా రహదారిపై ప్రవహిస్తున్న నీరు

పెళ్లకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు వద్ద స్వర్ణముఖినదిపై 1964లో అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి చెక్‌డ్యామ్ నిర్మించారు. దీని వల్ల రెండు పంట కాలువలు పుట్టుకొచ్చి వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోంది. అలాగే చెక్‌డ్యామ్‌కు దిగువ భాగాన శ్రీకాళహస్తి నుంచి పెళ్లకూరు, నాయుడుపేట, తొట్టంబేడు, బాలయపల్లి, ఓజిలి, వెంకటగిరి మండలాలను కలిపే రహదారి ఏర్పడింది. అయితే చెక్‌డ్యామ్ నుంచి పొంగిపొర్లే వరద ప్రవాహంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండు జిల్లాల మధ్య ఈ చెక్‌డ్యామ్ ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన జరిగాక సూళ్లూరుపేట పరిధిలో చేరినా భౌగోళికంగా శ్రీకాళహస్తికి సమీపంలో ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన నేతలు వారికి అవసరమైన చోట స్వర్ణముఖినదిపై వారధిని నిర్మించారు. అయితే సూళ్లూరుపేట నేతలకు జనం పడుతున్న పాట్లు కానరావడం లేదు. పెళ్లకూరు, నాయుడుపేట, తొట్టంబేడు, బాలయపల్లి, ఓజిలి, వెంకటగిరి మండలాల ప్రజలు శ్రీకాళహస్తికి వెళ్లడానికి కలవకూరు చెక్‌డ్యామ్ కింద ఉన్న దారే దగ్గర. అయితే చెక్‌డ్యామ్ నుంచి పారే నీటి కారణంగా దారంతా పాచి ఏర్పడి రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా మారింది. పాచి మీద నడిచి వెళ్లే సమయంలో జారిపడి జనం ప్రమాదాలకు గురవుతున్నారు. సాధారణ రోజుల్లో పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిపేయాల్సి వస్తోంది. స్వర్ణముఖినదిపై లోలెవల్ కాజ్‌వే నిర్మించండి మహాప్రభో అని అరవై ఏళ్లుగా ప్రజలు వేడుకుంటున్నా పట్టించుకునేవారే లేరు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కొణతనేరి నుంచి కోనేటిరాజుపాలెం వరకు 19 కిలోమీటర్లు తారురోడ్డు నిర్మించింది. అయితే చెక్‌డ్యామ్ వద్ద కాజ్‌వే లేని కారణంగా జనానికి కష్టాలు తప్పడంలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కలవకూరు వద్ద స్వర్ణముఖినదిపై లోలెవల్ కాజ్‌వే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



గూడూరు: వెండిచీరలో రాజరాజేశ్వరిదేవి, శాకాంబరిదేవిగా మహాలక్ష్మమ్మ - చిల్లకూరు: బంగారుచీరలో ముత్యాలమ్మ - కోట: మల్లెపూల అలంకారంలో కోటమ్మ - వాకాడు: విశేష అలంకరణలో పట్టాభిరాముడు

సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు

గూడూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగను ఆదివారం ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. స్థానిక రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని వెండిచీరతో అలంకరించారు. రెండో పట్టణ పరిధిలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అమ్మవారినిని దర్శించుకున్నారు. అన్నదానం చేశారు. స్థానిక గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం జరిపారు. సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో విజయదుర్గాదేవికి పూజలు నిర్వహించి, నవావరణ హోమం చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పంచాగ శ్రవణం చేశారు. పోలేరమ్మ రచ్చల వద్ద పూజలు నిర్వహించి భక్తులు అంబళ్ల పోసి మొక్కులు తీర్చుకున్నారు.

చిల్లకూరు: ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా ఆదివారం తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని బంగారుచీరతో అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక దేశమ్మ, గంగమ్మ, సుందరమ్మ, మాతమ్మ అమ్మవార్ల ఆలయాల్లోని ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయాల వద్ద భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవార్లకు నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారాల్లో ఉన్న అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట: స్థానిక గ్రామదేవత కోటమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని మల్లెపూలతో అలంకరించారు. అదేవిధంగా వీరాంజనేయ ఆలయంలో టీడీపీ నాయకులు తూపిలి రాధాకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. గూడలిలోని కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయం, తిప్పపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వరాలయం, జనార్దనస్వామి ఆలయాల్లో ఉగాది వేడుకలు జరిగాయి.

వాకాడు: మండలంలోని పట్టాభిరామాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు దివి అనంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అమరేంద్రరెడ్డి, మాలిని దంపతులు ఆలయ అలంకరణకు ఉభయ దాతలుగా వ్యవహరించారు.

చిట్టమూరు: మండలంలోని చిట్టమూరు, కోగిలి వడ్డికండ్రిగ, తాడిమేడు, అరూరు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ఉగాది వేడుకలు జరిగాయి.

వెంకటగిరి: గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు ఉన్నారు.

చిరంజీవి సేవాసంఘం చేయూత

తడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడిలింగాలపాడు గ్రామానికి చెందిన నూలేటి వెంకటేష్‌కు చిరంజీవి సేవాసంఘం ఆర్థిక చేయూత అందించింది. కొంత కాలంగా వెంకటేష్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న చిరంజీవి సేవాసంఘం సభ్యులు మాబాషా, హరిబాబు, కోటి, తేజ ఆదివారం వెంకటేష్‌ను కలిసి రూ.15వేలు అందజేశారు.

సీపీఎం ప్రజా చైతన్యయాత్ర

నాయుడుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యయాత్రలో భాగంగా సీపీఎం నాయకులు ఆదివారం నాయుడుపేటలోని జువ్వలపాళెం చెరువుగట్టు కాలనీని పరిశీలించారు. గిరిజనులు, దళితులు ఉన్న కాలనీలో మౌలిక సదుపాయాలు లేనట్లు గుర్తించారు. జువ్వలపాళెం చెరువుగట్టు కాలనీవాసులకు పక్కాగృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివకవి ముకుంద, వీరయ్య, అంకయ్య, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

కలప లారీ స్వాధీనం



అటవీశాఖ కార్యాలయం వద్ద కలప లారీ

సూళ్లూరుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా కలప తరలిస్తున్న లారీని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా పులికాట్ గ్రామీణ ప్రాంతం నుంచి కర్రతుమ్మ కట్టెలను తరలిస్తున్న లారీని జాతీయ రహదారిపై హోలిక్రాస్ కూడలి సమీపంలో డీఎఫ్‌వో హారికి తన సిబ్బందితో కలిసి పట్టుకొన్నారు. స్వాధీనం చేసుకున్న లారీని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

అధ్యాపకుడు పీర్‌కుమార్‌కు నంది అవార్డు

నెల్లూరు(విద్య), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గూడూరులోని ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ బీ.పీర్ కుమార్‌కు మెగా హెల్పింగ్ ఫౌండేషన్ నంది అవార్డు అందజేసింది. హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియంలోని భాస్కర్ ఆడిటోరియంలో రెండురోజుల క్రితం జరిగిన జాతీయ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో ఫౌండేషన్ ఎండీ శిరీషరెడ్డి చేతుల మీదుగా బంగారు నంది అవార్డును పీర్‌కుమార్ అందుకున్నారు. నెల్లూరులో నివాసం ఉంటున్న ఆయన గూడూరు కళాశాలలో పనిచేస్తూనే పాటలు, నాటికలు రచించడం, చిన్న పాత్రల ద్వారా నటనలో ప్రతిభ కనబరుస్తుండడంతో ఈ ఏడాది అవార్డుకు ఎంపిక చేశామని మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న పీర్‌కుమార్

నెలవలకు సత్కారం



నెలవల దంపతులను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులను టీడీపీ నాయకులు సత్కరించారు. ఆదివారం నాయుడుపేటలో నెలవలను కలిసిన నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నెలవలతో పాటు ఆయన సతీమణి అమృతసరళను సత్కరించారు. కార్యక్రమంలో పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్యానాయుడు, కృష్ణమనాయుడు, మురళీ నాయుడు, నరేంద్ర యాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి మిస్టరీ ఛేదించాలి



ర్యాలీ చేస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కోట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి మిస్టరీ ఛేదించాలని పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి కోట పట్టణంలో కేవీసీ పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ప్రవీణ్ మృతిపై మిస్టరీని తేల్చకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ నాయకులు నోవాబాబు, దినకర్ బాబు, జోసెఫ్, రంగనాథ్, మీజూరు మాధవ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 30(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన తిరుపతి రూరల్ పరిధిలోని సాయినగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. కుర్రకాలువకు చెందిన ఓబుల్ రెడ్డి మనవడు గోవర్ధన రెడ్డి(20) సాయినగర్‌లో నివాసముంటున్నాడు. స్నేహితుడు హేమంత్‌రెడ్డితో కలిసి చెడు తిరుగుళ్లు తిరుగుతూ తాగుడు, ధూమపానానికి బానిసయ్యాడు. శనివారం మధ్యాహ్నం డబ్బు కోసం హేమంత్‌రెడ్డి ఇంటికి వెళుతున్నట్లు నానమ్మ, తాతయ్యకు చెప్పి వెళ్లాడు. అదేరోజు రాత్రి హేమంత్‌రెడ్డి ఇంట్లో కరెంటు షాక్ కారణంగా గోవర్ధనరెడ్డి మృతిచెందినట్లు ఓబుల్‌రెడ్డికి ఫోన్ వచ్చింది. మృతదేహాన్ని పరిశీలించగా కుడికాలు బొటన వేలికి గాయమై ఉంది. హేమంత్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానం చెబుతుండడంతో రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి గోవర్ధనరెడ్డి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. గోవర్ధనరెడ్డి, హేమంత్‌రెడ్డి మధ్య అప్పు విషయంలో తగాదాలు ఉండేవని ఓబుల్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న తమిళనాడు బస్సు

● ఐదుగురికి స్వల్పగాయాలు




ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

తడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు దిగడానికి ఆగిన ఆర్టీసీ బస్సును తమిళనాడు బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా కనిగిరి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు శనివారం రాత్రి 9 గంటల సమయంలో చెన్నైకు బయలుదేరింది. ఆదివారం తెల్లవారుజామున తడకు చేరుకుంది. ప్రయాణికులు దిగుతున్న సమయంలో నెల్లూరు నుంచి చెన్నైకు వెళ్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి కనిగిరి డిపో బస్సును ఢీకొంది. దీంతో కనిగిరి ఆర్టీసీ బస్సు ముందుకు వెళ్లి డివైడర్ రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంతో రెండు బస్సులు దెబ్బతినగా, ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కనిగిరి డిపో బస్సు డ్రైవర్ లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలేరమ్మకు వెండి చీర బహూకరణ



వెండి చీర అందజేస్తున్న చక్రిధర్‌రెడ్డి దంపతులు



వెండి చీరలో పోలేరమ్మ

నాయుడుపేట టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మకు రూ.3 లక్షలు విలువచేసే వెండి చీరను పట్టణానికి చెందిన బుర్ల చక్రిధర్‌రెడి, శశికళ దంపతులు బహూకరించారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్చరణల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చిన చక్రిధర్‌రెడి, శశికళ దంపతులు పెదకాపు శ్రీనివాసులురెడ్డికి వెండిచీరను అందజేశారు. వెండిచీరను అలంకరించిన అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పట్టణంలోని అంకమ్మ, మానసాదేవి, దుర్గాదేవి ఆలయాల్లో ఉగాది వేడుకలు నిర్వహిం చారు. ఆయా కార్యక్రమాలలో దేవదాయశాఖ ఈవో రవికృష్ణ, నానాబాల సుబ్బారావు, మణి, గోపి, రామారావు, శ్రీనివాసులు, నారాయణ, రవి, సిద్ధయ్య, చిరువెళ్ల మునిరాజ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శివపార్వతుల ఊరేగింపు




ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఊరేగింపు ఉత్సవం వేడుకగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయంలోని స్వామివారి సన్నిధి వద్ద ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. పంచాంగ పఠనం అనంతరం స్వామిఅమ్మవార్లకు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉత్సవమూర్తులు పురవీధుల్లో ఊరేగింపుగా సాగారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో ఉగాది ఆస్థానం



నారాయణవనం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలవాసులు విశ్వావసు తెలుగు సంవత్సరాది ఉగాదిని ఘనంగా నిర్వహించు కున్నారు. ఆదివారం ఉదయం పద్మావతి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో స్వామిఅమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని నూతన పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పెద్ద శేష వాహనంపై కొలువు దీర్చి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉగాది ఆస్థానం నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఊరందూరులో కొలువై ఉన్న చెన్నకేశవస్వామికి ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలురకాల అభిషేకాలు నిర్వహించి అనంతరం విశేషంగా అలంకరించారు. ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ స్వామిఅమ్మవార్లకు అత్యంత వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు.

శుక బ్రహ్మాశ్రమంలో పంచాంగ శ్రవణం

శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూనందగిరి ఆధ్వర్యంలో ఆదివారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాది మిశ్రమ ఫలితాలు ఉంటాయని వెల్లడించారు. వర్షపాతం సాధారణంగా ఉంటుందని, ధరల భారం, ప్రకృతి వైపరీత్యాలు ఉంటాయన్నారు. సెప్టెంబరు 7న చంద్రగ్రహణం ఉంటుందని తెలిపారు.

ఘనంగా ఉగాది వేడుకలు


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, పచ్చాలమ్మ గుడి, కోదండ రామాలయం, చెంగాళమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అంద జేశారు. టీడీపీ మండల నాయకులు రవినాయుడు, మునిచంద్రనాయుడు, కార్తిక్‌నా యుడు తదితరులు ఎమ్మెల్యే ఆదిమూలంకు ఆయన స్వగ్రామంలో ఉగాది శుభకాంక్షలు తెలిపారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో స్వామిఅమ్మవార్లకు వేకువజామునే వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రామగిరి వాలీశ్వరస్వామి ఆలయం, కీళపూడి జలకంఠేశ్వరాలయం, నీరువాయి పరమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి.

భక్త కన్నప్పకు ముక్కంటి సారె



సారె తీసుకెళుతున్న ఈవో బాపిరెడ్డి - కన్నప్పకు సారె సమర్పిస్తున్న ఈవో

శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని ఆదివారం శివయ్యకు ప్రియ భక్తుడైన భక్తకన్నప్పకు ఆలయం తరపున సారెను శాస్త్రోక్తంగా సమర్పించారు. ముందుగా ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య సారెను తీసు కెళ్లారు. తేరువీధిలో ఉన్న భక్తకన్నప్ప ఆలయంలో సారెను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కోష్ట గణపతికి వెండి కవచం వితరణ



శ్రీకాళహస్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి గర్భాలయం వద్ద ఉన్న కోష్ట గణపతికి హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ, రాధిక రూ.7లక్షల విలువైన 7 కిలోల బరువైన వెండి కవచాన్ని వితరణ చేశారు. దాన్ని ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణమూర్తి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంజూరు శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో డ్రైవింగ్‌పై కేసుల నమోదు

రేణిగుంట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో డ్రైవింగ్‌పై గాజులమండ్యం పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేఎల్ఎం హాస్పిటల్ కూడలి, రేణిగుంట, తిరుచానూరు బైపాస్ రోడ్డులో రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తున్న ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై ఎస్ఐ సుధాకర్ కేసులు నమోదు చేశారు.

రెండు దశాబ్దాలుగా సాగుతున్న షాదీ మహల్ నిర్మాణం!


సత్యవేడులో అసంపూర్తిగా ఉన్న షాదీ మహల్

సత్యవేడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేద ముస్లిం కుటుంబాలు వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు నిర్మించ తలపెట్టిన షాదీ మహల్ నిర్మాణం 20 ఏళ్ళుగా అసంపూర్తిగా మిగిలి ఉంది. దీంతో పేద, మధ్య తరగతికి చెందిన ముస్లిం కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. సత్యవేడులో షాదీ మహల్ నిర్మాణం కోసం 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఆత్మ కార్యాలయం సమీపంలో కొంత స్థలాన్ని కేటాయిస్తూ రూ.5లక్షలను మంజూరు చేసింది. రాజీవ్ పల్లెబాట కార్యక్రమానికి సత్యవేడుకు వచ్చిన అప్పటి సీఎం వైఎస్ చేతుల మీదుగా షాదీ మహల్ నిర్మాణానికి భూమిపూజ జరిగింది. అయితే నిధులు చాలక పోవడంతో నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ షాదీమహల్ పనులను శ్లాబు వరకు పరిమితం చేసి చేతులెత్తేశాడు. అనంతరం 2016లో అప్పటి ఎమ్మెల్యే తలారి ఆదిత్య స్పందించి తన సొంత నిధులు రూ.10 లక్షలు వెచ్చించి షాదీ మహల్‌లో వధూవరుల గదులు నిర్మించడంతో పాటు, ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్, నీటి మోటర్ ఏర్పాటు తదితర పనులు చేసి పెట్టారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాదీ మహల్ నిర్మాణం గురించి అసలు పట్టించుకోలేదు. ఇదిలా ఉండగా 2020లో అసంపూర్తిగా ఉన్న షాదీ మహల్‌ను పూర్తి చేసేందుకు వక్ఫ్‌బోర్డు నుండి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో ప్రహరీ, డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణం చేపట్టనున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఈ పనులను స్థానిక వైసీపీ నేత ఒకరికి అప్పగించారు. అయితే పనులు మాత్రం ఒక్క అంగుళం కూడా జరగలేదు. దీంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయి. అసంపూర్తిగా ఉన్న షాదీ మహల్‌ను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు వస్తే నిరుపేద ముస్లింలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి షాదీ మహల్ నిర్మాణంపై దృష్టి సారించి, పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ముస్లిం కోరుతున్నారు.

ముక్కంటి ఆలయ డోల్ విద్వాన్‌కు ఉగాది పురస్కారం



శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ భజంత్రీ విభాగంలో డోలు విద్వాంసుడు ముని మల్లికార్జున్‌కు ఉగాది పురస్కారం వరించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా విజయవాడలో ఆదివారం అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు మల్లికార్జున్‌కు అభినందనలు తెలిపారు. ముని మల్లికార్జున్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్య నేర్పిన తమ గురువులకు ధన్యవాదాలు తెలుపుతూ శ్రీకాళహస్తికి సంగీత విభాగంలో మరింత పేరు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

అన్నదానం

వరదయ్యపాళెం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలమత్తూరు పంచాయతీకి చెందిన గిరిజనులకు గూడూరు పట్టణానికి చెందిన వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు షేక్ అబ్దుల్ రహమాన్, కరీమున్నీసా, సోనియా కలిసి జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు అబ్దుల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపండి

సత్యవేడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న తూర్పుగోదావరి జిల్లా కొంతమూరు సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను అరెస్ట్ చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సత్యవేడులో స్థానిక క్లాక్ టవర్ వద్ద నిరసన తెలిపారు. బెరాకా ప్రయోర్‌హౌస్ బ్రదర్ ప్రేమ్‌రాజ్, బ్రదర్ శ్యామ్, పాస్టర్ కవి అరసన్, పాస్టర్ జస్టియన్ తదితరలు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై వీధి కుక్కల దాడి

శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) వీధికుక్కలు దాడి చేయడంతో గురవమ్మ (60) గాయపడింది. తొట్టంబేడు మండలం పూడి దళితవాడకు చెందిన గురవమ్మ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి సమీపంలో ఉన్న దుకాణానికి వెళ్లింది. ఈ క్రమంలో రోడ్డుపై రెండు కుక్కలు దాడి చేయడంతో కాలిపై బలయమైన గాయాల య్యాయి. స్థానికులు గురవమ్మను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేర్చారు.

ముస్లింలకు ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు

శ్రీకాళహస్తి,మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సుధీర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్ష ఉండి సోమవారం రంజాన్ పండుగ జరుపుకుంటున్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దయతో వారు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు ఆదివారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని ఆకాంక్షించారు.

కార్మిక సంఘంలో చేరండి

కేవీబీపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్థానిక మామిడితోపు వద్ద ఆదివారం తాపీ మేస్త్రీ వెంకటరత్నం ఆధ్వర్యంలో భవన కార్మికుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ భవన కార్మికుల కార్యదర్శి చంద్రబాబు హాజరయ్యారు. కేవీబీపురం మండలంలో భవన కార్మికుల సంఘం లేకపోవడంతో నష్టపోతున్నారని చెప్పారు. సంఘంలో చేరి సభ్యత్వం తీసుకుంటే బీమా అందుతుందని చెప్పారు.

ఏపీఐఐసీ భూముల్లో మట్టి తరలింపు


మట్టి తరలింపులో ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు గ్రామంలోని ఏపీఐఐసీ భూముల్లోని మట్టిని సమీపంలో ఉన్న పరిశ్రమ యాజమాన్యం తరలిస్తుండడంతో సర్పంచ్ చంద్రారెడ్డి, గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఐఐసీ భూముల్లో మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల ద్వారా విచ్చలవిడిగా తరలిస్తున్నారని తెలిపారు. మట్టిని తరలిస్తున్న విషయాన్ని ఏపీఐఐసీ అధికారులకు ఫిర్యాదు చేసి ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లను అప్పగించినట్లు తెలిపారు. ఏపీఐఐసీ అధికారులు భూముల్లో మట్టిని తరలించకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఘనంగా ఉగాది కవి సమ్మేళనం


గొడుగుచింత గోవిందయ్య, నారాయణస్వామిలకు సన్మానం

శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితలు ఉగాది ప్రాశస్త్యాన్ని, సమకాలీన సమాజ స్థితిగతులను, మానవ విలువల ప్రాధాన్యతలపై తమ స్వీయ కవితలను వినించారు. అనంతరం లగడపాటి భాస్కర్ సాహితీ పురస్కారాలను ఆయన కుమార్తెలు కిరణ్మయి, కృష్ణశశి అందించారు. సాహితీ రంగంలో కృషి చేసిన గొడుగుచింత గోవిందయ్య, నారాయణస్వామిను ఘనంగా సన్మానించి రూ.5వేలు నగదు, జ్ఞాపిక అందించి సత్కరించారు. అనంతరం కవులందరికి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తీగల వెంకటయ్య, గురునాథం, గణేష్, బాలమునిశివకుమార్, మునిసుబ్బారెడ్డి, షణ్ముగం, ఒబ్బు దేవిప్రసాద్, మునస్వామి, రవికుమార్, పిళ్లారి బత్తినయ్య, మంజునాథ్, గోపాలకృష్ణ, చెంగారెడ్డి, గాంధీ, చెంచుకృష్ణ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో...



కవి సమ్మేళనంలో పాల్గొన్న మేడసాని మోహన్ తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి జరిగిన కవి సమ్మేళనం రసరమ్య భరితంగా సాహితీప్రియులను ఆకట్టుకుంది. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ అవధాని మేడసాని మోహన్ తన రచనలను వినిపించారు. అలాగే పలువురు స్థానిక కవులు తెలుగు భాష మాధుర్యాన్ని పదాల అల్లికతో వల్లించారు. ఈవో బాపిరెడ్డి, కవులు గొడుగుచింత గోవిందయ్య, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య మహిళా కార్మికులకు ఉగాది పురస్కారాలు


మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించి జ్ఞాపికలను అందజేస్తున్న తేజవతి తదితరులు

రేణిగుంట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న 75 మంది మహిళా కార్మికులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఆదివారం పట్టణంలోని నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో పబ్లిక్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ తేజవతి హాజరయ్యారు. అంతకుముందు మహిళా పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. రేఖ ముంగర, బి.సీనప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ దాతృత్వం



వరదయ్యపాళెం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వరదయ్యపాళెం పట్టణంలో ఆదివారం ఎస్ఐ మల్లికార్జున ముస్లింలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. పేద ముస్లింలు రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కల్కి ఆక్రమణలను తొలగించండి


మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

వరదయ్యపాళెం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరు అటవీ ప్రాంతంలో కల్కి ఆశ్రమం ఆక్రమణలను తొలగించాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం ఆయన బస్టాండు వద్ద మాట్లాడుతూ... కాషాయ దుస్తులు ధరించి ప్రజలను మోసం చేస్తున్న వారిలో విజయకుమార్ ఒకరన్నారు. కల్కి భగవాన్ పేరుతో 20 సంవత్సరాలుగా వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ మండలాల్లో అటవీ భూములు, దళితుల అసైన్డ్ భూములను ఆక్రమించుకుని ఆశ్రమాలను అక్రమంగా నిర్మించాడన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్కి ఆశ్రమం ఆక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు.

కయ్యూరు బాలసుబ్రహ్మణ్యానికి ఉగాది విశిష్ట పురస్కారం



శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు, కవి, రచయిత, మిమిక్రీ కళాకారుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం తిరుపతి యూత్ హాస్టల్‌లో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఉగాది విశిష్ట పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, గ్రామీణ అభివృద్ధిశాఖ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోపాల్, శ్రీరాములు, శ్రీహరిరావు, సంస్థ వ్యవస్థాపకుడు పైడి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం త్రైత సిద్ధాంత విశ్వావసు నూతన సంవత్సర క్యాలెండర్లును ఆ సంస్థ సభ్యులు ఆవిష్కరించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుడు రచించిన జ్ఞాన తెలుగు సూచికల్లో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించారన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిచారు.